
ప్రజల చేతిలో
www.ayudamdaily.com
ఆయుధం
The Common People's Voice
శనివారం | సెప్టెంబరు 12, 2026 | సంపుటి : 7 | సంచిక : 88 | పేజీలు : 2

## రైజింగ్ 2047లో వరంగల్‌కు ప్రత్యేక స్థానం కల్పించాలి

- త్వరలోనే ఏయిర్ పోర్ట్ కూడా అందుబాటులోకి రానుంది
- కొత్త పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలి
- ఉమ్మడి వరంగల్ పారిశ్రామిక అభివృద్ధిపై అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి




# రైతుల మోటార్లకు మీటర్లు పెట్టబోం

## రైతుల్లో భయాందోళన సృష్టించవద్దు



- గ్రామాల్లో మైక్రో గ్రిడ్ల నిర్మాణం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, ఆయుధం:** వ్యవసాయ మోటార్లకు ఎట్టిపరిస్థితుల్లోనూ మీటర్లు పెట్టబోమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. కేంద్రం తెచ్చిన ఆర్‌డీఎస్‌ఎస్ పథకంలో ఎక్కడా రైతుల వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టాలనే నిబంధన లేదని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. శాసనమండలిలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను అప్‌గ్రేడ్ చేయడానికే కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఆర్‌డీఎస్‌ఎస్ పథకాన్ని వినియోగించుకుంటామన్నారు. అందులో ఎక్కడా వ్యవసాయ మోటర్లకు మీటర్లకు పెట్టాలనే నిబంధన లేదని భట్టి విక్రమార్క తెలిపారు. అలాంటి భయాందోళన సృష్టించవద్దని ఆయన సూచించారు. థర్మల్‌తో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెంచుకుంటూ వెళ్లాల్సిన అవసరముందని భట్టి విక్రమార్క తెలిపారు.

### గ్రామాల్లో మైక్రో గ్రిడ్ల నిర్మాణం

రాష్ట్రంలోని 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందించడానికి ప్రభుత్వం ఏటా రూ.14,000 కోట్లు, 53 లక్షల గృహ వినియోగదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం 5,000 కోట్లు చెల్లిస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ విధంగా కేవలం సబ్సిడీల రూపంలోనే ఏటా దాదాపు రూ.19,000 కోట్లు ఖర్చవుతోందని ఆయన వివరించారు. ఈ నిధులను సోలరైజేషన్ వైపు మళ్లిస్తే ఖజానాపై భారం తగ్గడంతో పాటు రైతులు స్వయంసమృద్ధి సాధిస్తారన్నారు. పగటిపూట లభించే సోలార్ విద్యుత్ రాత్రివేళ అందుబాటులో ఉండనందున, ఎంపిక చేసిన గ్రామాల్లో బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్స్‌తో మైక్రో గ్రిడ్లను నిర్మిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. సోలార్ విద్యుత్‌తో పాటు బ్యాటరీ స్టోరేజ్ ద్వారా గ్రామాలకు విద్యుత్ ఇచ్చే 'మైక్రో గ్రిడ్' ప్రాజెక్టులను ప్రయోగాత్మకంగా (పైలట్) చేపట్టామని ఆయన మండలిలో వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే వీజిఎఫ్ ద్వారా మూడుసార్లు టెండర్లు పిలిచినా, బ్యాటరీ స్టోరేజ్ ఖర్చులు ఎక్కువగా ఉండటం వల్ల కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని పేర్కొన్నారు. భవిష్యత్తులో సాంకేతికత పెరిగి బ్యాటరీ ధరలు తగ్గితే ఈ ప్రాజెక్టులు వేగవంతమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

### గ్రీన్ ఎనర్జీని బలోపేతమే లక్ష్యం

రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు తగినట్లుగా పర్యావరణహితమైన హరిత ఇంధన రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇస్తూ తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ 2025 విశేషాలను వివరించారు.
గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2014 నాటికి రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ కేవలం 15,497 మెగావాట్లుగా మాత్రమే ఉండేదని, అయితే సెప్టెంబర్ 9 నాటికి అది 19,543 మెగావాట్లకు చేరిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. వివిధ కారణాల రీత్యా ఈ ఏడాది డిమాండ్ 20,000 నుంచి 21,000 మెగావాట్లకు పెరిగే అవకాశం ఉందని, ఈ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకునే సాంప్రదాయ, సాంప్రదాయేతర ఇంధన వనరులను సమన్వయం చేస్తూ ఈ నూతన పాలసీని తెచ్చినట్లు తెలిపారు.
రైతులకు 2,000 మెగావాట్ల సోలార్ విద్యుత్ పీఎంకుసుమ్ పథకం కింద రైతులకు 2,000 మెగావాట్ల సోలార్ విద్యుత్ అందించాలని నిర్ణయించినట్లు భట్టి వెల్లడించారు. ఒక్కొక్కరు 2 మెగావాట్ల చొప్పున సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా రైతులను ప్రోత్సహిస్తున్నామన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలోని మన్ననూరు ప్రాంతంలో పైలట్ ప్రాజెక్ట్‌గా పూర్తి సోలరైజేషన్ పూర్తి చేసి ప్రారంభించినట్లు తెలిపారు. కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్రాజెక్టులను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ప్రోత్సహిస్తోందని, ఇటీవల కరీంనగర్‌లో ఒక ప్లాంట్‌కు శంకుస్థాపన చేసినట్లు గుర్తుచేశారు. మణుగూరు వద్ద సింగరేణి చేపట్టిన మిథేన్ గ్యాస్ ప్రాజెక్ట్ ఖర్చు ఎక్కువగా ఉండటంతో గిట్టుబాటు కాలేదని, అయితే కోల్ గ్యాసిఫికేషన్‌పై అధ్యయనం జరుపుతున్నామని తెలిపారు.



## 1008 కమల పుష్పాలతో రాజరాజేశ్వరి దేవికి విశేష పూజ

- శ్రావణమాసం చివరి అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమం

**వరంగల్, ఆయుధం:** వరంగల్ ఎంజీఎం సెంటర్‌లోని శ్రీ గణేష్ సుబ్రహ్మణ్య సహిత శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారి సన్నిధిలో శ్రావణమాసం చివరి అమావాస్య సందర్భంగా అమ్మవారికి 1008 కమల పుష్పాలతో విశేష పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి అమ్మవారిని కమల పుష్పాలతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. శ్రావణమాసం చివరి అమావాస్య సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం ద్వారా ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని, సమాజంపై అమ్మవారి కృపాకటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని భక్తులు ప్రార్థించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజల కుటుంబాల్లో సుఖశాంతులు వెల్లివిరియాలని, ప్రతి ఒక్కరూ సంతోషంగా, ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

## అనలాగ్ పనీర్‌పై నిషేధం



**హైదరాబాద్, ఆయుధం:**
తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో అనలాగ్, నాన్ డెయిరీ, ఆర్టిఫిషియల్ పనీర్‌పై నిషేధం విధించింది. ప్రజారోగ్య ప్రయోజనాల దృష్ట్యా ఏడాది పాటు నిషేధం విధిస్తున్నట్లు టీజీ సేఫ్ వెల్లడించింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది.
పనీర్ పేరుతో తయారీ, ప్రాసెసింగ్, ప్యాకింగ్, నిల్వ, పంపిణీ, రవాణా విక్రయాలపై టీజీ సేఫ్ నిషేధం విధించింది. రాష్ట్రవ్యాప్తంగా ఇది అమల్లో ఉంటుందని తెలిపింది. సెప్టెంబర్ 10 నుంచి ఈ నిర్ణయం అమల్లో ఉన్నట్లు పేర్కొంది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్2006లోని సెక్షన్ 30(2)(a) కింద టీజీ సేఫ్ ఆదేశాలు జారీ చేసింది.

## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో మహిళల భాగస్వామ్యం కీలకం

- మహిళా సంఘాల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించాలి
- నా సమాజం – సురక్షిత సమాజం" అనే సంకల్పంతో ముందుకు సాగుదాం
- సీపీ శ్వేత, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ, ఆయుధం:** డ్రగ్స్, మద్యం వంటి వ్యసనాలకు యువత దూరంగా ఉండేలా అవగాహన కల్పించి, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీపీ శ్వేత, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళా క్షేత్రంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో సమాజ భద్రత కోసం డ్రగ్స్ నిర్మూలననే లక్ష్యంగా చేపట్టిన సంఘమిత్ర అవగాహన కార్యక్రమాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, డీసీపీ దార కవిత, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మంద సుజాత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై గ్రామీణ మహిళలు, యువత కుటుంబాలకు అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడైనా మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం లేదా అక్రమ రవాణా గురించిన సమాచారం తెలిసినప్పుడు పోలీసులకు బాధ్యతగా తెలియజేయాలన్నారు. అభివృద్ధి లో మహిళల చైతన్యం ముఖ్య (మిగతా 2 లో..)



## దళితుల పట్ల బీఆర్ఎస్, బీజేపీలది అంటరాని వైఖరి

- టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ కోటూరి మానవతారాయ్, డీసీసీ అధ్యక్షులు ఇనగాల, అయూబ్

**హనుమకొండ, ఆయుధం:** దళితుల పట్ల బీఆర్ఎస్, బీజేపీ పార్టీలది హీనమైన అంటరాని వైఖరి అని టీపీసీసీ అధికార ప్రతినిధి డా.కోటూరి మానవతారాయ్, హనుమకొండ, వరంగల్ డీసీసీ అధ్యక్షులు ఇనుగాల వెంకట్రాంరెడ్డి, అయూబ్ పేర్కన్నారు. శుక్రవారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి డాక్టర్ కోటూరి మానవతారాయ్ వరంగల్, హన్మకొండ జిల్లాల పార్టీ అధికారిక ఇంఛార్జీ గా నియమితులయ్యారు. ఈ నియామకం అనంతరం తొలిసారిగా హన్మకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆధ్వర్యంలో హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బిజెపిది వికసిత్ భారత్ కాదు వివక్ష భారత్ అని విమర్శించారు. ఉత్తరాఖండ్ రాష్ట్రం లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున కార్గే ప్రసంగించిన వేధిక ను బిజెపి శుద్ధి చేసి దళిత నాయకుడికి ఘోర అవమానం చేశారన్నారు. తెలంగాణ లో బిఆర్ఎస్ బిజెపిని అనుసరిస్తుందని.. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న దళిత స్పీకర్ ను బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు బూతులు తిట్టడం క్షమించరాని నేరం అని అన్నారు. కాంగ్రెస్ ఎస్సీ విభాగం నేతృత్వంలో దళిత స్పీకర్ ను అవమానించినందుకు. దళితులు కెసిఆర్ ఫామ్ హౌస్ దగ్గర డప్పు కొట్టి తమదైన శైలిలో నిరసన తెలిపారని గుర్తు చేశారు. ఎర్రవల్లి ఫాంహౌస్ ప్రాంతంలో దళితులు నడిచిన నేలను కెసిఆర్ ఆదేశాల మేరకు బిఆర్ఎస్ కార్యకర్తలు పసుపు నీళ్ళ తో శుద్ధ చేయడం అనాగరిక చర్యగా అభివర్ణించారు. అంతరించి పోయిన అంటరాని తనాన్ని ప్రోత్సహిస్తూ మూఢనమ్మకాలను వాప్తి చేస్తూ కెసిఆర్ క్షుద్ర రాజకీయాలకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. కెసిఆర్ మొదటి నుండి దళిత ద్రోహిగా ముద్ర పడ్డారని.. దళిత ముఖ్యమంత్రి అని దళితులను దగా చేశాడని దుయ్యబట్టారు. దళితులకు మూడు ఎకరాలని దళితులను మోసం చేశారన్నారు. డాక్టర్ రాజయ్యను కారణంలేకుండా ఉపముఖ్యమంత్రి పదవి నుండి తొలగించి దళిత జాతికి అవమానం చేశాడన్నారు. భట్టివిక్రమార్క దళిత సిఎల్పి నాయకుడు ఉంటే చూసి ఓర్వలేకే కాంగ్రెస్ ఎమ్మెల్యే ను పార్టీ పిరాయింపులకు పాల్పడ్డాడు. కెసిఆర్ ముఖ్యమంత్రి హోదాలో అంబేద్కర్ పూలే జయంతి వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొనకుండా దళిత బహుజనుల పట్ల పూర్తి వ్యతిరేకతను (మిగతా 2లో..)

## బ్యాంకు ఉద్యోగుల సమ్మె సక్సెస్

- వరంగల్, హనుమకొండలో ఉద్యోగుల ర్యాలీలు
- సమ్మె ప్రభావంతో జనం అవస్థలు





**వరంగల్, ఆయుధం:** యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు శుక్రవారం దేశవ్యాప్తంగా నిర్వహించిన బ్యాంకు ఉద్యోగుల సమ్మెలో భాగంగా హనుమకొండ, వరంగల్‌లో ఉద్యోగులు విధులు బహిష్కరించి పెద్ద ఎత్తున సమ్మె చేపట్టారు. నల్ల బ్యాడ్జీలతో ఆందోళనలో పాల్గొన్నారు. న్యాయమైన తమ డిమాండ్లు పరిష్కరించాలని కదం తొక్కారు. వరంగల్ ఎస్‌బీఐ ప్రధాన శాఖ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వందలాది మంది బ్యాంకు ఉద్యోగులు పాల్గొని తమ ఐక్యతను, పోరాట స్ఫూర్తిని చాటారు.హనుమకొండలో అంబేద్కర్ విగ్రహం వద్దకు ర్యాలీగా వచ్చిన ఉద్యోగులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఆయా బ్యాంకుల ఎదుట ధర్నాలు నిర్వహించి నిరసన తెలిపారు.ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంతో పాటు బ్యాంకింగ్ రంగ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఐదు రోజుల బ్యాంకింగ్ విధానాన్ని అమలు చేయాలని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, పనితీరు ఆధారిత ప్రోత్సాహక విధానంలో తగిన మార్పులు చేయాలని కోరారు. బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయడంతో పాటు, పెరుగుతున్న పని భారానికి అనుగుణంగా అదనపు సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. పెన్షన్ పునరుద్ధరించాలని కోరారు. బ్యాంకింగ్ రంగంలో ప్రైవేటీకరణను తక్షణమే నిలిపివేయాలని, ప్రభుత్వ రంగ బ్యాంకులను పరిరక్షించాలని ఉద్యోగులు నినదించారు. ఉద్యోగుల హక్కులను కాపాడడంతో పాటు ప్రజా బ్యాంకింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం ఐక్యంగా పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.వరంగల్ లో జరిగిన కార్యక్రమంలో ఎస్‌బీఐ అధికారుల సంఘం డీజీఎస్ వై. ప్రవీణ్ కుమార్, అవార్డు స్టాఫ్ డీజీఎస్ సి.హెచ్. సంతోష్ కుమార్, ఓబీసీ డీజీఎస్ రజనీకాంత్, సేవా డీజీఎస్ రమణతో పాటు వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, పెద్ద సంఖ్యలో బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.
వరంగల్, హనుమకొండలో సమ్మె ఎఫెక్ట్ బ్యాంకు ఉద్యోగులు సమ్మెకు దిగడంతో శుక్రవారం బ్యాంకింగ్ కార్యకలాపాలు పూర్తిగా స్తంభించిపోయాయి. బ్యాంకు శాఖల్లో నగదు ఉపసంహరణ, డిపాజిట్లు, ఇతర లావాదేవీల కోసం వచ్చిన ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు ప్రాంతాల్లో ఏటీఎంలు కూడా అందుబాటులో లేకపోవడంతో అత్యవసర నగదు అవసరాలకు ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. దీనికితోడు శనివారం, ఆదివారం, సోమవారం వరుసగా సెలవులు రావడంతో బ్యాంకింగ్ సేవలకు అంతరాయం పెరిగే అవకాశం ఉంది. నగదు లావాదేవీలు, ఇతర బ్యాంకింగ్ అవసరాల కోసం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది.



## కాశి విశ్వేశ్వరాలయంలో చండీ హోమం

**వరంగల్, ఆయుధం:** ప్రసిద్ధ కాశిబుగ్గ రంగనాయక స్వామి దేవాలయం లో శుక్రవారం అమావాస్య సందర్భంగా, ఆలయ చైర్మన్ గోషికొండ శకుంతల సుధాకర్ ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్ దంపతులు శామంతుల ఉషా శ్రీనివాస్, ధర్మకర్తల మండలి లోకేష్ రేణుక సభ్యులు నీలం అరుణ శ్రీనివాస్, పల్లంకొండ రాజమణి, రమేష్, పిట్టల కోటేశ్వర్, లోకేష్, రేణుక, పూజారి ఆరుట్ల కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో చండీ హోమం జరిగింది ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని పూజలు నిర్వహించారు తదనంతరం గోల్కొండ సుధాకర్ శకుంతల దంపతుల ఆధ్వర్యంలో అన్న వితరణ కార్యక్రమం జరిగింది.




గణేష్ ఉత్సవాలు..

## ఖైరతాబాద్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

**హైదరాబాద్, ఆయుధం:** వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఖైరతాబాద్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నట్లు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. బడా గణేశ్ దర్శనానికి వచ్చే వాహనదారులు గమనించాలని కోరారు. సెప్టెంబర్ 12 నుంచి 24 వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించారు. రోజూ ఉదయం 11 నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని తెలిపారు.



## వినాయక నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

**జనగామ, ఆయుధం :** పరస్పర సమన్వయం, సహకారంతో శ్రీ వినాయక నవరాత్రోత్సవాలు విజయవంతం చేద్దామని జనగామ డిసిపి రాజ మహేంద్రనాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి డాక్టర్ మోహనకృష్ణ భార్గవ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. సెప్టెంబర్ 14న శ్రీ గణేష విగ్రహ స్థాపన, 23 బుధవారం నిమజ్జనం జరుపుకోవాలని నవరాత్రోత్సవ తేదీలను ప్రకటించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజల్లో ఆధ్యాత్మిక, ధార్మిక, సాంస్కృతిక చైతన్యం తీసుకురావడానికి, కులవర్గజాతి భేదం లేని సామాజిక సమరసత సాధించడానికి నవరాత్రోత్సవాలు దోహదపడతాయని తెలిపారు. అందుకోసం పరిషత్ విస్తృతంగా కృషి చేస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా వినాయక మండప నిర్వాహకులకు పోలీస్ యంత్రాంగం మరియు ప్రభుత్వ అన్ని రకాలుగా సహకరించాలని, ఆంక్షలు అనుమతుల పేరిట ఇబ్బందులకు గురి చేయకూడదని కోరారు. పర్యావరణ పరిరక్షణ, నిమజ్జన ఏర్పాట్లు, శాంతి భద్రతలకై కృషి, నిమజ్జనం రోజున మద్యం దుకాణాల మూసివేత వంటి అనేక అంశాలపై చర్చించి వినతిపత్రాన్ని అందించారు. అందుకు డిసిపి రాజమహేంద్రనాయక్ సానుకూలంగా స్పందించారు, ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నవరాత్రులు పూర్తిచేద్దామని విహెచ్పీ సమర్పించిన అంశాలపై దృష్టి సారిస్తామని హామి ఇచ్చారు. ఈ సమావేశంలో పరిషత్ ఉపాధ్యక్షుడు బచ్చుబాలనారాయణ, కోశాధికారి దిడిగం లక్ష్మణ్, భజరంగ్దల్ శాయితేజ భార్గవ, గుమ్మడవెల్లి ఉమేష్, లింగాల ఘనపూర్ అధ్యక్షుడు శివరామకృష్ణ, సేవా ప్రముఖ్ బత్తిని శ్రీనివాస్, పట్టణ ఉపాధ్యక్షుడు రవికుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలి

- హనుమకొండ అదనపు కలెక్టర్ ఎన్. రవి



**హనుమకొండ, ఆయుధం:** హనుమకొండ నయీమ్ నగర్ లోని పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విచారణ కేంద్రంలో నో మ్యాపింగ్, అనామలీస్ జాబితాలోని ఓటర్ల నుండి స్వీకరిస్తున్న ప్రక్రియను అదనపు కలెక్టర్ ఎన్.రవి పరిశీలించారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్ 2026 )లో భాగంగా నో మ్యాపింగ్, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్ల నుండి స్వీకరిస్తున్న ధ్రువ పత్రాల విచారణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. శుక్రవారం హనుమకొండ నయీమ్ నగర్ లోని 240వ పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విచారణ కేంద్రంలో నో మ్యాపింగ్, అనామలీస్ జాబితాలోని ఓటర్ల నుండి స్వీకరిస్తున్న ప్రక్రియను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ నో మ్యాపింగ్, అనామలీస్ జాబితాలోని ఓటర్ల నుండి స్వీకరించిన ధ్రువపత్రాలను త్వరగా పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం సమర్పించిన ధ్రువపత్రాలు ఉన్నాయా లేదా అనేది క్షుణ్ణంగా విచారణ అధికారులు పరిశీలించాలన్నారు. జాబితాలో ఉండి నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్దేశిత సమయం, పోలింగ్ కేంద్రం, ఎన్నికల సంఘం సూచించిన ధ్రువ పత్రాలతో హాజరయ్యే విధంగా బిఎల్వోలు, ఇతర అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా ఏఈఆర్వో చల్లా ప్రసాద్, బీఎల్వో సూపర్ వైజర్లు, బీఎల్వోలు, తదితరులు పాల్గొన్నారు.



## ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ తనిఖీ

**వరంగల్, ఆయుధం:** వార్షిక తనిఖీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ శుక్రవారం వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీస్ కమిషనర్ సిబ్బంది కిట్ ఆర్టికల్స్ పరిశీలించారు. సిబ్బందిని శాఖపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులను పరిశీలించారు. ట్రాఫిక్ పోలీసుల విధుల నిర్వహణ, వాహనాల తనిఖీలు, ట్రాఫిక్ నిబంధనల అమలు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.
ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రమాదాల నివారణ, వాహనదారులు మరియు పాదచారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ సూచించారు. ముఖ్యంగా ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, సమర్థవంతమైన సేవలను అందించాలని తెలిపారు. స్టేషన్‌లోని రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, విధుల కేటాయింపు తదితర అంశాలను పరిశీలించిన పోలీస్ కమిషనర్, విధుల్లో మరింత అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన పోలీసింగ్ సేవలు అందించాలని సీపీ సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలో ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీ సత్యనారాయణతో ఎస్.ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

## దళితుల పట్ల బీఆర్ఎస్, బీజేపీలది
# అంటరాని వైఖరి

(మొదటి పేజీ తరువాయి..)
ప్రదర్శించాదని అన్నారు.

**బీఆర్ఎస్, బీజేపీల నయవంచనను ప్రజల్లోకి తీసుకెళ్తాం - ఇనగాల**


హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. మానవతారాయ్ రాకతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. దళిత వివక్షపై మాట్లాడుతూ.. "బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు దళితులను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే వాడుకుంటున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు దళితులను విస్మరించి, ఇప్పుడు 'శుద్ధి'లు, 'పూజలు' అంటూ కొత్త నాటకాలకు తెరలేపడం సిగ్గుచేటన్నారు. గ్రామంలో, ప్రతి గడపకూ వెళ్లి బీఆర్ఎస్, బీజేపీల దళిత వ్యతిరేక వైఖరిని, వారి నయవంచనను ఎండగడతాం" అని స్పష్టం చేశారు.

వరంగల్ డీసీసీ అధ్యక్షులు ఎండీ అయ్యూబ్ మాట్లాడుతూ, జిల్లాల్లో కాంగ్రెస్ శ్రేణులన్నీ సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, విపక్షాల తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పెరుమాండ్ల రామకృష్ణ, బందెల భద్రయ్య, ఆరూరి సాంబయ్య, వీసం సురేందర్ రెడ్డి, మహమ్మద్ రహమతుల్లా, హర్షం అశోక్, మేడారపు సుధాకర్ నేత, అచ్చ వర్ష, రోషన్ గైక్వాడ్, కుమ్మరి రవి తదితరులు పాల్గొన్నారు.

## 'తెలంగాణ రైసింగ్-2047' ప్రణాళికలో
# వరంగల్ కు ప్రత్యేక స్థానం కల్పించాలి

- ఇప్పటికే హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారి 163ని పారిశ్రామిక కారిడార్ గా ప్రభుత్వం ప్రకటించింది
- త్వరలోనే ఏయిర్ పోర్ట్ కూడా అందుబాటులోకి రానుంది
- కొత్త పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలి
- ఉమ్మడి వరంగల్ పారిశ్రామిక అభివృద్ధిపై అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**హైదరాబాద్, ఆయుధం:** ఉమ్మడి వరంగల్ జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి కావాల్సిన అన్ని వనరులు ఉన్నందున కొత్త పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని అసెంబ్లీలో స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ శాసనసభ సమావేశాలలో భాగంగా ప్యానెల్ స్పీకర్ స్థానంలో ఆసీనులై సభను విజయవంతంగా నిర్వహిస్తున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వరంగల్ ప్రాంత సమగ్ర పారిశ్రామిక పురోగతిపై అసెంబ్లీలో మాట్లాడారు. గత మూడు రోజులుగా శాసనసభ ప్యానెల్ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ సభా నిర్వహణలో తనదైన అనుభవాన్ని ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి.. ప్రశ్నోత్తరాల సమయంలో వరంగల్ జిల్లా పారిశ్రామిక ప్రాధాన్యతను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ... హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారి 163 (NH163) ని ప్రభుత్వం ఇప్పటికే పారిశ్రామిక కారిడార్‌గా ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపకల్పన చేస్తున్న 'తెలంగాణ రైసింగ్ 2047' విజన్ డాక్యుమెంట్ లో వరంగల్ ప్రాంతానికి ప్రత్యేక స్థానం, అత్యున్నత ప్రాధాన్యత కల్పించాలని పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ను కోరారు.
ఒక ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి కావలసిన అన్ని అనుకూలతలు వరంగల్‌కు ఉన్నాయని కడియం శ్రీహరి సభకు వివరించారు. వరంగల్ జిల్లాను ఆనుకుని గోదావరి నది ప్రవహిస్తుండటంతో పరిశ్రమలకు సరిపడా నీటి లభ్యత ఉందని అలాగే సమృద్ధిగా విద్యుత్ ఉత్పత్తి వనరులు ఉన్నాయని తెలిపారు. దీంతో పాటు విస్తారమైన బొగ్గు గనులు, ఐరన్ ఓర్ లభ్యత, ప్రతిష్టాత్మక మెగా టెక్స్‌టైల్ పార్క్ వరంగల్‌లో కొలువై ఉందని అన్నారు. వరంగల్ నగరానికి అతిత్వరలోనే ఎయిర్ పోర్ట్ కూడా అందుబాటులోకి రానుండటంతో గ్లోబల్ కనెక్టివిటీ పెరుగుతుందని పేర్కొన్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని, వరంగల్ జిల్లాలో కొత్త పరిశ్రమలు నెలకొల్పేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, బహుళ జాతి కంపెనీలను ఆకర్షించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.
ఎమ్మెల్యే కడియం శ్రీహరి లేవనెత్తిన అంశాలపై రాష్ట్ర శాసనసభా వ్యవహారాలు, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నేరుగా స్పందించారు. హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారిని పూర్తిస్థాయి పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేయడానికి కావలసిన అన్ని రకాల సహాయ సహకారాలు, అవస



రమైన చర్యలను ప్రభుత్వం త్వరలోనే వేగవంతంగా చేపడుతుందని సభముఖంగా హామీ ఇచ్చారు. సభాధ్యక్షుడిగా బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తూనే, ఉమ్మడి వరంగల్ జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కడియం శ్రీహరి అసెంబ్లీ వేదికగా చూపిన చొరవ ఆయనకు ఉన్న సుదీర్ఘ రాజకీయ పరిజ్ఞానానికి, పరిపాలన అనుభవానికి నిదర్శనంగా నిలుస్తుంది.

## తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను
# దొంగిలించడానికి యత్నిస్తున్న బీజేపీ

- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
- సిపిఐ ఆధ్వర్యంలో సాయుధ పోరాట వారోత్సవాల ర్యాలీ, సభ




**హనుమకొండ, ఆయుధం:** తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను దొంగిలించడానికి బిజెపి ప్రయత్నిస్తున్నదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. రజాకార్లు, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన చారిత్రాత్మక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాన్ని శుక్రవారం హనుమకొండలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ ఆధ్వర్యంలో హనుమకొండ పట్టణంలో బాలసముద్రం నుండి ఏకశిలా పార్కు వరకు ర్యాలీ నిర్వహించారు.బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ, ఏకశిలా పార్కు వద్ద గల, తెలంగాణ సాయుధ పోరాట అమరుడు థానునాయక్ విగ్రహం వరకు కొనసాగింది.ఈ సందర్భంగా సీపీఐ శ్రేణులు, కార్మికులు, రైతులు, ప్రజా సంఘాల నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని, సాయుధ పోరాట వీరులకు జోహార్లు అర్పిస్తూ నినాదాలు చేశారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీపీఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటం భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాగిన అసలైన చారిత్రాత్మక పోరాటమని కొనియాడారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నేతృత్వంలో ప్రజలు సాహసోపేతమైన పోరాటం చేశారని, ఆనాటి పోరాట స్ఫూర్తిని నేటి తరాలు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. నాటి సాయుధ రైతాంగ పోరాటంలో నాలుగున్నర వేల కమ్యూనిస్టు అమరుల త్యాగాలతో ఎర్ర బారిన నేల తెలంగాణ అని అన్నారు. నిజాం నిరంకుశ పాలనను కూలదోసింది కమ్యూనిస్టులేనని,పటేల్ సైన్యం కాదని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట ఫలితంగానే నిజాం నిరంకుశ పాలన రద్దయ్యిందని,పటేల్ సైనిక చర్య వల్ల కాదని అన్నారు. ఆ పోరాటంలో 10 లక్షల ఎకరాల భూమి పేదలకు పంచి, 3 వేయి గ్రామాలను విముక్తి చేసింది కమ్యూనిస్టులేనని చెప్పారు. ఆనాడు పటేల్ చీకటి ఒప్పంద ఫలితమే నిజాం రాజుకు గవర్నర్ పదవి దక్కిందని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట అమర వీరులను స్మరించుకుందామని, వారి ఆశయ సాధనకు ప్రతిజ్ఞ చేద్దామని పిలుపునిచ్చారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని, అమరుల జీవిత చరిత్రలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠ్యాంశాలుగా చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్,సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, బత్తిని సదానందం, మునిగాల బిక్షపతి, ఏదునూరి వెంకట్రాజం,నేదునూరి రాజమౌళి,ఎన్. అశోక్ స్టాలిన్, యేషబోయిన శ్రీనివాస్, కండె నర్సయ్య, నిమ్మల మనోహర్, గుంటి రాజేందర్, అల్వాల రాజు, నోముల కిషోర్, రాంగోపాల చారి తదితరులు పాల్గొన్నారు.




## శ్రవణ్ తడండ్ల కు 'బెస్ట్ ఇమేజ్ ఆఫ్ ది ఇయర్' అవార్డు

**ములుగు, ఆయుధం:** భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఫోటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా (PAI), ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ క్రియేటివిటీ & కల్చర్ కమిషన్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించిన జాతీయ ఫోటోగ్రఫీ పోటీ-2026లో ములుగు జిల్లా పాలంపేట (రామప్ప) గ్రామానికి చెందిన ఫోటోగ్రాఫర్ శ్రవణ్ తాడన్ల ప్రతిభను చాటారు. "My India: 80 Years of Democracy and Freedom" అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీకి దేశవ్యాప్తంగా విశేష స్పందన లభించింది. 16 రాష్ట్రాల నుంచి 182 మంది ఫోటోగ్రాఫర్లు 352 ఛాయాచిత్రాలను సమర్పించారు. ప్రముఖ జ్యూరీ సభ్యులు ఛాయాచిత్రాలను పరిశీలించి వివిధ విభాగాల్లో 60 అవార్డులను ఎంపిక చేశారు. శ్రవణ్ తడండ్ల సమర్పించిన ఛాయాచిత్రానికి ప్రతిష్ఠాత్మకమైన "Best Image of the Year Award" లభించింది. అవార్డు ప్రదానోత్సవం అక్టోబర్ 2న గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం యూనివర్సిటీ ఆడిటోరియంలో జరగనుంది. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను విశ్వవిద్యాలయం తరపున గోల్డ్ మెడల్స్‌తో సత్కరించనున్నారు.

## ఖైరతాబాద్ పరిసరాల్లో
# ట్రాఫిక్ ఆంక్షలు

**హైదరాబాద్, ఆయుధం:** వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఖైరతాబాద్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నట్లు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. బడా గణేశ్ దర్శనానికి వచ్చే వాహనదారులు గమనించాలని కోరారు. సెప్టెంబర్ 12 నుంచి 24 వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించారు. రోజూ ఉదయం 11 నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని తెలిపారు. రద్దీ ఉన్న ప్రాంతాలను కాకుండా ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలని సూచించారు.

**వాహనాల మళ్లింపులు ఇలా..**

- పాత పీఎస్ సైఫాబాద్ నుంచి బడా గణేశ్ వైపు వచ్చే వాహనాలు ఇక్బాల్ మినార్ వైపు మళ్లింపు
- ఇక్బాల్ మినార్ నుంచి ఐమ్యాక్స్ వైపు వెళ్లే వాహనాలు సెక్రటేరియట్ ఎక్స్ రోడ్డు వైపు..
- నెక్లెస్ రోటరీ నుంచి మింట్ కాంపౌండ్ వైపు వెళ్లే వాహనాలు సెక్రటేరియట్ జంక్షన్, ఖైరతాబాద్ ఫ్లైఓవర్ వైపు మళ్లింపు
- నిరంకారి నుంచి ఖైరతాబాద్ రైల్వే గేట్ వైపు వెళ్లే వాహనాలు పాత పీఎస్ సైఫాబాద్ జంక్షన్ వైపు..

**పార్కింగ్ ప్రాంతాలు..**

ఖైరతాబాద్ బడా గణేశ్ దర్శనానికి వచ్చే భక్తుల కోసం పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. రేస్ కోర్స్ రోడ్, ఎన్టీఆర్ ఘాట్, ఐమ్యాక్స్ పక్కన హెచ్ఎండీఏ పార్కింగ్, ఐమ్యాక్స్ ఎదురుగా ఖాళీ స్థలంలో పార్కింగ్ చేసుకోవచ్చన్నారు. ఖైరతాబాద్ జంక్షన్ వైపు నుంచి వచ్చే భక్తులు విశ్వేశ్వరయ్య భవన్ వద్ద వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అత్యవసర ట్రాఫిక్ సహాయం కోసం 90102 03626 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని సూచించారు.



## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో మహిళల
# భాగస్వామ్యం కీలకం

(మొదటి పేజీ తరువాయి..)
భూమిక పోషిస్తుందన్నారు. అన్నీ శాఖల అధికారులు సహకరిస్తేనే రాబోయే రోజుల్లో మాదక ద్రవ్యాల వాడకాన్ని పూర్తిగా నివారించవచ్చన్నారు.
జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... మహిళా స్వయం సహాయక సంఘాలు, టౌన్ లెవల్ ఫెడరేషన్ల సభ్యులు రహిత సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని కోరారు. మహిళా సంఘాలు, టౌన్ లెవల్ ఫెడరేషన్లకు జిల్లాలో ఎంతో బలమైన నెట్‌వర్క్ ఉందని తెలిపారు. ఒక చిన్న సందేశాన్ని మహిళా సంఘాల ద్వారా పంపితే అది వేలాది మంది మహిళలకు, తద్వారా లక్షలాది కుటుంబాలకు చేరే అవకాశం ఉందన్నారు. పట్టణ ప్రాంతాల్లోనే పెద్ద సంఖ్యలో మహిళా సభ్యులు ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లోనూ దాదాపు లక్ష మంది వరకు మహిళలు వివిధ సంఘాల్లో సభ్యులుగా ఉన్నారని పేర్కొన్నారు. యువతలో మార్పులను తల్లులే ముందుగా గుర్తించాలని, యువత డ్రగ్స్ లేదా మద్యం వ్యసనాలకు లోనవుతున్నప్పుడు వారి ప్రవర్తనలో అనేక మార్పులు కనిపిస్తాయని చెప్పారు. గతంలో అందరితో కలిసి మెలిసి ఉండే యువకులు లేదా యువతులు అకస్మాత్తుగా ఒంటరిగా ఉండటం, ఎక్కువగా మాట్లాడటం లేదా తమకు సంబంధించిన విషయాలను కుటుంబ సభ్యులతో చెప్పకపోవడం వంటి ప్రవర్తనా మార్పులను తల్లులు, కుటుంబ సభ్యులు ముందుగానే గుర్తించాలని సూచించారు. పిల్లలు డబ్బులు అడిగినప్పుడు దేనికి ఖర్చు చేస్తారు అనే విషయాలను తెలుసుకోవాలని సూచించారు. మహిళల సహకారం లేకుండా డ్రగ్స్ నిర్మూలన సాధ్యం కాదని పేర్కొన్నారు. డ్రగ్స్ వ్యతిరేక కార్యక్రమాలను కేవలం పోలీసు, ప్రభుత్వ యంత్రాంగంతోనే నిర్వహించడం సాధ్యం కాదని, మహిళా సంఘాలు, కుటుంబాలు, సమాజం సహకారం ఎంతో అవసరమన్నారు. ఎంజీఎం ఆసుపత్రిలో డీఅడిక్షన్ కేంద్రం సామర్థ్యాన్ని పెంచడంతో పాటు, వ్యసన బాధితులకు వైద్య చికిత్సతోపాటు కౌన్సెలింగ్ సహాయం అందుతుందని కలెక్టర్ తెలిపారు. మన కుటుంబానికి, మన సమాజానికి డ్రగ్స్ వద్దు అనే సందేశాన్ని మహిళా స్వయం సహాయక సంఘాలు, వివిధ వేదికలు, సమావేశాలు, వీడియో సందేశాల ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. మహిళా సంఘాల బలమైన నెట్‌వర్క్ ద్వారా ఈ సందేశాన్ని ప్రతి గ్రామం, ప్రతి వార్డు, ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అందరి సమిష్టి కృషితోనే డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, జిల్లా ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, డీఆర్డీఏ మేన శ్రీను, మెప్మా పీడీ రాజేశ్వర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## 17ను తెలంగాణ విలీన దినోత్సవంగా ప్రకటించాలి

**- సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా**

**వరంగల్, ఆయుధం:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భారతదేశ ప్రజా ఉద్యమాల చరిత్రలో ఒక గొప్ప అధ్యాయమని, ఆ పోరాట చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాల సందర్భంగా వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్ సెంటర్‌లో రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చేన్నబోయిన కమలమ్మ, అప్పన్నల స్థూపాలకు సిపిఐ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం కేవలం ఒక ప్రాంతానికి సంబంధించిన ఉద్యమం కాదని, భూస్వామ్య దోపిడీ, వెట్టి చాకిరి, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పేదలు, రైతులు, కూలీలు, మహిళలు ఐక్యంగా సాగించిన మహత్తర ప్రజా పోరాటమని పేర్కొన్నారు. నాటి తెలంగాణలో సామాన్య ప్రజలు అనేక రకాల దోపిడీ, అణచివేతలకు గురయ్యారని, అలాంటి పరిస్థితుల్లో కమ్యూనిస్టుల నాయకత్వంలో రైతాంగం ధైర్యంగా తిరుగుబాటు చేసి తమ హక్కుల కోసం పోరాడిందన్నారు. ఈ పోరాటంలో వేలాది మంది రైతులు, కూలీలు, మహిళలు, యువత పాల్గొని




ఎన్నో త్యాగాలు చేశారని తెలిపారు. చేన్నబోయిన కమలమ్మ, అప్పన్న వంటి పోరాట యోధుల త్యాగాలు తెలంగాణ ప్రజల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. రాష్ట్ర సమితి సభ్యులు తాటిపాముల వెంకటరాములు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తిని నేటి తరం తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబర్ 17ను అధికారికంగా ప్రకటించాలి

సెప్టెంబర్ 17కు తెలంగాణ చరిత్రలో ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, అందువల్ల సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ చరిత్రను రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించకుండా, వాస్తవ చారిత్రక నేపథ్యాన్ని ప్రజలకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి పంజాల రమేష్ వరంగల్ మండల కార్యదర్శి గుండె బద్రి జిల్లా కార్యవర్గ సభ్యులు అక్కపెల్లి రమేష్ వీరగొని శంకరయ్య కందిక చెన్నకేశవులు జిల్లా సమితి సభ్యులు గుంపల్లి మునీశ్వరుడు చింతకింది కుమారస్వామి ఎండి అక్బర్ పాషా ల్యాదల్ల శరత్ తాళ్లపల్లి రహేళ పరికిరాల రమేష్ జన్ను రవి తాళ్లపల్లి జాన్ పాల్ డి సాంబమూర్తి మియాపురం గోవర్ధన చారి బోట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695